సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

ఆదివారం । 22 । అక్టోబర్ । 2023



కాంగ్రెస్‌కు పట్టం కట్టడం ఖాయం

అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టడం ఖాయమని ఆ పార్టీ అభ్యర్థి సత్యనారాయణ రావు అన్నారు. - IIIలో▸



పెన్సిల్, చాక్‌పీస్‌పై బతుకమ్మ

పెన్సిల్ గ్రాఫైట్‌పై, చాక్‌పీస్‌లపై అతి చిన్న పరిమాణంలో బతుకమ్మ ఆకృతిని రూపొందించి అబ్బురపరిచాడు ఆర్ట్ ఉపాధ్యాయుడు ఆడెపు రజనీకాంత్. - IIIలో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.2°/18.7°

జిల్లాలో ఉదయం నుంచి ఎండతోపాటు ఉక్కపోత ఉంటుంది. సాయంత్రం చల్లగా ఉంటుంది. రాత్రి మంచు కురుస్తుంది.

పట్టణమే.. పశ్చిమం

- పూర్తిగా నగరంలోనే హనుమకొండ పశ్చిమ నియోజకవర్గం
- విద్యావేత్తలు అధికంగా ఉన్న ప్రాంతం
- ఇక్కడ నుంచి గెలిచిన నలుగురికి కేబినెట్‌లో స్థానం

అన్నల ఇలాఖాలో.. ఎన్నికల సందడి

- ఒకప్పుడు నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో ఎన్నికలంటే భయం
- నేడు అదే గ్రామాల్లో ఎన్నికల కోలాహలం
- ఏళ్ల తరబడిగా సాగిన నక్సల్స్ కార్యకలాపాలు

ఓరుగల్లుకు చేరిన పారామిలటరీ బలగాలు

- వివరాలు IIలో▸

కమల దళం రెడీ!



చందుపట్ల కీర్తిరెడ్డి
భూపాలపల్లి



ఎర్రబెల్లి ప్రదీప్‌రావు
వరంగల్ తూర్పు



రావు పద్మ
వరంగల్ పశ్చిమ



విజయరామారావు
స్టేషన్ ఘన్‌పూర్



కొండేటి శ్రీధర్
వర్ధన్నపేట



దశమంతరెడ్డి
జనగామ



హుస్సేన్ నాయక్
మహబూబాబాద్

మొదటి జాబితాలో ఏడుగురి పేర్లు

- త్వరలో మరో ఐదు స్థానాలకు ప్రకటన
- అభ్యర్థులకే నేరుగా ఎన్నికల కమిటీ ఫోన్
- బీజేపీ నేతల సంబురాలు

జంగ్ తెలంగాణ

సాక్షిప్రతినిధి, వరంగల్: భారతీయ జనతా పార్టీ టీమ్ రెడీ అయ్యింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12 స్థానాలకు గాను ఏడు చోట్ల అభ్యర్థులకు ఆ పార్టీ ఎన్నికల కమిటీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈమేరకు రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, నాయకులు జవదేకర్, సునీల్ బన్సల్‌తో కూడిన కమిటీ నియోజకవర్గాల వారీగా శనివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు అభ్యర్థులకు ఫోన్ చేసి వారి పేర్లను ఖరారు చేసినట్లు సమాచారం ఇచ్చారు. సార్వత్రిక ఎన్నికల సమరంలో ప్రచారంతో దూసుకుపోవాల్సిందిగా సంకేతాలిచ్చారు. వరంగల్ తూర్పు అభ్యర్థిగా ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, వరంగల్ పశ్చిమ అభ్యర్థిగా రావు పద్మ పేర్లు ఖరారు చేసినట్లు సమాచారం ఇచ్చారు. భూపాలపల్లి నియోజకవర్గ అభ్యర్థిగా చందుపట్ల కీర్తిరెడ్డి, జనగామకు ఆరుట్ల దశమంతరెడ్డి అభ్యర్థిత్వం ఖరారైంది. స్టేషన్‌ఘన్‌పూర్‌కు మాజీ మంత్రి జి.విజయరామారావు, వర్ధన్నపేట (ఎస్సీ)కు మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, మహబూబాబాద్ అసెంబ్లీ స్థానానికి జాటోతు హుస్సేన్‌నాయక్‌ను అభ్యర్థులుగా ఎంపిక చేసినట్లు త్రిసభ్య కమిటీ సమాచారం ఇచ్చింది. ఎంపిక నిర్ణయాన్ని ఈసారి నేరుగా అభ్యర్థులకే ఫోన్ ద్వారా తెలియజేసిన పార్టీ అధిష్టానం.. అధికారికంగా మీడియా సమావేశం ద్వారా వెల్లడించలేదు. అభ్యర్థుల ఎంపిక ఫైనల్ అయినట్లు సమాచారం అందుకున్న ఏడు నియోజకవర్గాల్లో అభ్యర్థుల అనుచరులు బాణసంచా పేల్చి, స్వీట్లు పంచి సంబురాలు చేసుకున్నారు.

కాగా.. పరకాల, నర్సంపేట, ములుగు, పాలకుర్తి, డోర్నకల్ నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఎంపికపై ఎన్నికల కమిటీ కసరత్తు చేస్తోంది.

మరోసారి బరిలోకి..

బీజేపీ త్రిసభ్య కమిటీ ఖరారు చేసిన ఏడుగురు అభ్యర్థుల్లో నలుగురు మొదటిసారి బరిలోకి దిగుతుండగా.. ముగ్గురు రెండోసారి తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. 2014 ఎన్నికల్లో జనగామ నుంచి బీజేపీ అభ్యర్థిగా కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పోటీ చేసి 21,113 ఓట్లు సాధించగా, 2018లో పోటీ చేసిన కేవీఎల్ఎన్ రెడ్డికి 3,122 ఓట్లు రాగా, దశమంత రెడ్డి ఈసారి తలపడనున్నారు. భూపాలపల్లి నుంచి 2014లో గండ్ర సత్యనారాయణరావు పోటీ చేయగా.. ఆయనకు 57,530 ఓట్లు వచ్చాయి. 2018లో పోటీ చేసిన బీజేపీ అభ్యర్థి చందుపట్ల కీర్తిరెడ్డికి 15,744 ఓట్లు రాగా, రెండోసారి ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం దక్కించుకున్నారు. మహబూబాబాద్ నుంచి 2018లో పోటీచేసి 11,646 ఓట్లు సాధించుకున్న జాటోతు హుస్సేన్ నాయక్‌ను ఈసారి కూడా బరిలోకి దింపుతోంది. 2018లో స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి పెరుమాండ్ల వెంకటేశ్వర్లు పోటీ చేయగా, ఈసారి మాజీ మంత్రి జి.విజయరామారావుకు అవకాశం ఇచ్చింది. వరంగల్ పశ్చిమ నుంచి మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు 2014, 2018లో పోటీ చేయగా, ఆ ఎన్నికల్లో వరుసగా 18,584, 5,979 ఓట్లు వచ్చాయి. ఈసారి పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మను బరిలోకి దింపుతున్నారు. రావు పద్మ గతంలో వరంగల్ తూర్పు నుంచి 2014లో పోటీ చేసి ఓడిపోయారు. 2018లో తూర్పు నుంచి కుసుమ సతీశ్ పోటీ చేయగా, ఈసారి ఎర్రబెల్లి ప్రదీప్‌రావుకు అవకాశం కల్పించింది. వర్ధన్నపేట నుంచి మొదటిసారి బీజేపీ టికెట్‌పై పోటీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.

ఆ ఐదు స్థానాల నుంచి ఎవరో?

ఉమ్మడి వరంగల్‌లో 12 స్థానాల నుంచి అభ్యర్థులను బరిలోకి దింపనున్నట్లు ప్రకటించిన బీజేపీ ఏడు స్థానాలకు ఖరారు చేసింది. మిగతా ఐదు స్థానాల నుంచి పోటీచేసే అవకాశం ఎవరికి దక్కుతుంది? అన్న చర్చ జరుగుతోంది. నర్సంపేట నుంచి టికెట్ ఆశించిన మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ఇటీవల కాంగ్రెస్‌లో చేరగా.. ఎర్రబెల్లి మదన్ మోహన్‌రావు, మరో ఇద్దరు టికెట్ రేసులో ఉన్నారు. డోర్నకల్ నుంచి లక్ష్మణ్‌నాయక్, నర్సింహులపేట జెడ్పీటీసీ సభ్యురాలు సంగీత, మదన్ లాల్, గుగులోతు దేవిక, బుల్లెట్ కృష్ణ, పరకాల నుంచి మాజీ ఎమ్మెల్యే భిక్షపతి, డాక్టర్ కాళీ ప్రసాద రావు, డాక్టర్ విజయ్‌చందర్, పాలకుర్తి నుంచి లేగ రామ్మోహన్‌రెడ్డి, కర్ర శ్రీనివాసరెడ్డి, పాకనాటి దామోదర్‌రెడ్డి పోటీ పడుతున్నారు. వీరిలో అభ్యర్థులు ఎవరనేది పార్టీ తేల్చాల్సి ఉంది. అలాగే ములుగు నుంచి ఇటీవల పార్టీలో చేరిన మాజీ మంత్రి చందూలాల్ కుమారుడు అజ్మీరా ప్రహ్లాద్, కృష్ణవేణి నాయక్, జవహర్‌లాల్ తదితరుల పేర్లు అధిష్టానం పరిశీలనలో ఉన్నాయి. దాదాపుగా అజ్మీరా ప్రహ్లాద్ ఖరారు కావొచ్చని పార్టీవర్గాలు చెబుతున్నాయి.

అభ్యర్థుల బయోడేటా -IIలో▸

సద్దులకు సిద్ధం



భూపాలపల్లి పట్టణంలో పూలు కొనుగోలు చేస్తున్న మహిళలు

- నేటి వేడుకకు బతుకమ్మ ప్రాంగణాలు ముస్తాబు
- మున్సిపాలిటీ పరిధిలో ప్రత్యేక ఏర్పాట్లు
- జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో పర్యవేక్షణ



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

భూపాలపల్లి అర్బన్: సద్దుల బతుకమ్మ వేడుకలను ఆదివారం నిర్వహించేందుకు అధికారులు జిల్లావ్యాప్తంగా ఏర్పాట్లు పూర్తిచేశారు. సద్దుల బతుకమ్మ జరుపుకునే ప్రాంగణాలు, ఆలయ ప్రాంగణాలను అధికారులు ముస్తాబు చేశారు. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధితో పాటు జిల్లావ్యాప్తంగా గ్రామాల్లో ప్రాంగణాలు సిద్ధం చేశారు. జలాశయాలు, దేవాలయాలు, పలు కూడళ్లలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బతుకమ్మలను నీటిలో వదిలే సమయంలో ఇబ్బందులు చోటుచేసుకోకుండా బృందాలను జలాశయాల వద్ద ఉంచనున్నారు. పోలీస్ యంత్రాంగం ఇప్పటికే బందోబస్తుపై దృష్టి సారించింది. బతుకమ్మ జరుపుకునే ప్రాంతాల్లో ఏర్పాట్లను అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ అనిల్‌కుమార్, అధికారులు శనివారం పరిశీలించారు.

సందడి షురూ..

పుట్టింటికి వచ్చిన ఆడబిడ్డలు.. వైభవంగా బతుకమ్మ పండగను జరుపుకునేందుకు పూలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. ఇక కొత్త బట్టల కొనుగోళ్లతో భూపాలపల్లి పట్టణంలో సందడి నెలకొంది. పండుగను పురస్కరించుకొని గ్రామాల నుంచి కొందరు పూలను సేకరించి తీసుకొచ్చి పట్టణంలో విక్రయిస్తున్నారు.

విద్యుత్ వెలుగుల్లో ఆటపాటలు..

భూపాలపల్లి పట్టణంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో సద్దుల బతుకమ్మ పండుగను కనుల పండువగా జరుపుకునేందుకు ప్రభుత్వ శాఖలు సహకరిస్తున్నాయి. ప్రధానంగా మున్సిపల్, గ్రామ పంచాయతీల్లో రంగురంగుల విద్యుత్ దీపాల అలంకరణలతో ప్రాంగణాలను ముస్తాబు చేయిస్తున్నారు. ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేస్తున్నారు. పట్టణంలో పెద్దఎత్తున వేడుకలను నిర్వహించేందుకు అంబేద్కర్ స్టేడియం, సంత, హనుమాన్, అయ్యప్ప, రామాలయాల్లో వేదికలు ముస్తాబు చేస్తున్నారు.

పూలకు భలే గిరాకీ..

గ్రామాల నుంచి కొందరు తంగేడు, గునుగు, టేకు, బంతి పూలను జిల్లాకేంద్రం, మండలకేంద్రాల్లోకి తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. తంగేడు పూల కట్టను సైజును బట్టి రూ.10నుంచి రూ.50వరకు విక్రయిస్తున్నారు. గునుగు పూల కట్టను రూ.20నుంచి రూ.30వరకు, బంతి పూలను ప్రాంతాన్ని బట్టి రూ.60నుంచి రూ.100వరకు అమ్ముతున్నారు.

న్యూస్‌రీల్

ఘనంగా దుర్గామాత చండీహోమం




కాళేశ్వరం: శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కాళేశ్వరంలో ఏడవరోజు అమ్మభవానీ కమిటీ ఆధ్వర్యంలో శనివారం చండీహోమం నిర్వహించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రేవెల్లి మమత, మాజీ సర్పంచ్ మెంగాని మాధవి, దేవస్థానం ధర్మకర్త అడప సమ్మయ్య, భక్తులు పాల్గొన్నారు.

మహాఅన్నదానం




భూపాలపల్లి రూరల్: దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం భూపాలపల్లి పట్టణంలో శివాజీ యూత్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సుభాష్‌కాలనీలోని సింగరేణి ఫంక్షన్‌హాల్ ఎదుట శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దుర్గాదేవి మండపం వద్ద మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి సిద్దు ముఖ్యఅతిథిగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 17వ వార్డు కౌన్సిలర్ మురళి, మాజీ జెడ్పీటీసీ లట్ల రాజబాబు, శివాజీ యూత్ నాయకులు బాలు, శ్రావణ్, వేణు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన మాజీ జెడ్పీటీసీ



మహాముత్తారం: మహాముత్తారం మాజీ జెడ్పీటీసీ, బీజేపీ నాయకుడు చిడెం బాపు శనివారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆయనతోపాటు మండల కేంద్రానికి చెందిన మార్క తిరుపతి, ముత్యం తిరుపతితో పాటు పలువురు చేరారు. వీరికి మంథని జెడ్పీ చైర్‌పర్సన్, మంథని బీఆర్ఎస్ అభ్యర్థి పుట్ట మధు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మందల రాజిరెడ్డి, ఎంపీటీసీ శ్రీపతి సురేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాదారపు స్వామి, మార్క రాము పాల్గొన్నారు.

నగదు, బంగారు ఆభరణాలు స్వాధీనం



భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కమలాపూర్ క్రాస్‌రోడ్ వద్ద తనిఖీల్లో నగదు, బంగారం పట్టుబడినట్లు సీఐ రాంనర్సింహారెడ్డి తెలిపారు. ఎస్సై శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. తనిఖీల్లో నల్లమొక్క రవి వద్ద రూ.1.50లక్షలు, సాద సురేందర్‌రెడ్డి వద్ద 165 గ్రాముల బంగారు ఆభరణాలు పట్టుబడినట్లు తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి సీజ్ చేసిన వస్తువులను నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్‌కి అప్పగించినట్లు తెలిపారు.

పోలీసు అమరవీరుల త్యాగం గొప్పది



అమరదామం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఎస్పీ



పోలీస్ అమరుల కుటుంబాలకు జ్ఞాపికలను అందజేస్తున్న కలెక్టర్, ఎస్పీ

- కలెక్టర్ భవేష్‌మిశ్రా

భూపాలపల్లి అర్బన్: శాంతి భద్రత, దేశ రక్షణ కోసం అసువులు బాసిన సైనికుల ఆశయాలను కొనసాగించే దిశగా అందరం ముందుకు సాగాలని, పోలీసు అమరవీరుల త్యాగం గొప్పదని కలెక్టర్ భవేష్‌మిశ్రా అన్నారు. పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో శనివారం నిర్వహించిన పోలీసు అమరవీరుల కార్యక్రమానికి కలెక్టర్ హాజరై మాట్లాడారు. పోలీసు అంటేనే ఒక బాధ్యతాయుతమైన ఉద్యోగం అని తమ భార్య పిల్లలకు దూరమై అందరి సంరక్షణలో ఉంటారని కొనియాడారు. కరోన క్లిష్ట పరిస్థితుల్లో తమ ప్రాణాలను లెక్కచేయకుండా ప్రజల ప్రాణాలను కాపాడిన పోలీసులకు ఈ సందర్భంగా సలాం చేస్తున్నానని అన్నారు. దేశ రక్షణలో సరిహద్దులో శత్రు దేశాలపై వీరోచితంగా పోరాటంచేసి ప్రాణాలు విడిచిన ప్రతి సైనికుడికి మనస్ఫూర్తిగా జోహార్లు తెలియజేస్తున్నానన్నారు. ఎస్పీ కిరణ్ ఖారే మాట్లాడుతూ.. పోలీసు ఉద్యోగం అనేది కత్తిమీద సాము లాంటిదన్నారు. బాధ్యతాయుతంగా పనిచేస్తేనే నేరాలను అరికట్టగలుగుతామని చెప్పారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన బాధిత పోలీస్ కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉండి ఆదుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్, ఎస్పీలు పోలీస్ అమరులకు నివాళులర్పించారు. అమరవీరుల కుటుంబాలకు చిరుకానుకలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బంది, పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


నగదు, మద్యం పంపిణీని అరికట్టాలి



మాట్లాడుతున్న కలెక్టర్ భవేష్‌మిశ్రా

రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో అక్రమ నగదు మద్యం పంపిణీని అరికట్టేందుకు అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి భవేష్‌మిశ్రా అన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు, ఎన్నికలలో అక్రమ మద్యం, డబ్బు పంపిణీని అరికట్టడానికి తీసుకోవాల్సిన చర్యలపై శనివారం సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి భవేష్‌మిశ్రా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్, ఎన్నికల అధికారి భవేష్‌మిశ్రా మాట్లాడుతూ.. జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలను పారదర్శకంగా పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు విధులను నిష్పక్షపాతంగా నిర్వహించాల్సి ఉంటుందని అన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదులకు ఎప్పటికప్పుడు స్పందిస్తూ వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. 1950 టోల్ ఫ్రీ నంబర్, సీ విజిల్ యాప్ నుంచి వచ్చే ఫిర్యాదులు నిర్దేశిత సమయంలో పరిష్కారం అయ్యే విధంగా చూడాలని ఆదేశించారు. బెల్టు షాపుల నిర్వాహకులపై కఠినంగా వ్యవహరించాలన్నారు. ఎస్పీ కిరణ్ ఖారే మాట్లాడుతూ.. జిల్లాలో అక్రమంగా నగదు, మద్యం సరఫరా జరగకుండా సరిహద్దుల వద్ద పకడ్బందీ చెక్‌పోస్టులు నిర్వహించాలని పోలీసులను ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదులు సకాలంలో పరిష్కరించాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీఓ రమాదేవి, జెడ్పీ సీఈఓ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా నిర్వహించాలి



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

భూపాలపల్లి: అసెంబ్లీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు పక్కా కార్యాచరణ రూపొందించుకొని అమలుచేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి వికాస్‌రాజ్, డీజీపీ రాష్ట్రస్థాయి ఉన్నత అధికారులతో కలిసి ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. రాజకీయ పార్టీల, అభ్యర్థుల నుంచి వచ్చే ఫిర్యాదులకు తప్పనిసరిగా 24 గంటల వ్యవధిలో తీసుకున్న చర్యలపై లిఖిత పూర్వక సమాధానం అందించాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తూ పట్టుబడిన బంగారం, నగదు రూ.10లక్షల కంటే తక్కువైతే వెంటనే జిల్లా స్థాయిలో ఏర్పాటుచేసిన గ్రీవెన్స్ సెల్‌కు అప్పగించాలని తెలిపారు. రూ.10 లక్షల కంటే ఎక్కువ నగదు సీజ్ చేస్తే ఐటీ అధికారులకు అప్పగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ భవేష్‌మిశ్రా, ఎస్పీ కిరణ్‌ఖారే, అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అన్ని వర్గాలకు గౌరవం

- ముదిరాజ్‌లను గుర్తించిందే బీఆర్ఎస్
- మంత్రి సత్యవతి రాథోడ్



భూపాలపల్లి రూరల్: మాట్లాడుతున్న మంత్రి సత్యవతి రాథోడ్, పక్కన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

భూపాలపల్లి రూరల్: సీఎం కేసీఆర్ నాయకత్వంలోనే రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు గౌరవం దక్కిందని రాష్ట్ర గిరిజన, మహిళా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. భూపాలపల్లి పట్టణంలోని ఏఎస్ఆర్ గార్డెన్‌లో శనివారం ముదిరాజ్ అభినందన ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ కులవృత్తులు చేసుకునే వారి గురించి గతంలో ఏ ప్రభుత్వమూ ఆలోచించలేదన్నారు. ముదిరాజ్‌లకు 2016నుంచి ఉచితంగా చేప పిల్లల పంపిణీ చేస్తున్నామని చెప్పారు. 7600 టూవీలర్స్‌తో పాటు, త్రీవీలర్, ఫోర్ వీలర్ వాహనాలు అందించినట్లు తెలిపారు. ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన బండా ప్రకాశ్‌ను సీఎం కేసీఆర్ రాజ్యసభ సభ్యుడిగా, శాసన మండలి సభ్యుడిగా, శాసన మండలి డిప్యూటీ చైర్మన్‌గా నియమించి గౌరవించారని గుర్తుచేశారు. శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నీలి విప్లవం మొదలైందన్నారు. సీఎం కేసీఆర్ చెరువులపై ముదిరాజ్‌లకు హక్కులు కల్పించారని చెప్పారు. నియోజకవర్గంలోని ముదిరాజ్‌లు గండ్ర వెంకటరమణారెడ్డికి మద్దతుగా నిలవాలని కోరారు. ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ ముదిరాజ్‌లను గుర్తించిందే బీఆర్ఎస్ ప్రభుత్వం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు సదయ్య, పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే సమగ్రాభివృద్ధి

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి అభివృద్ధి బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య అన్నారు. జిల్లాకేంద్రంలోని పలు కాలనీల్లో శనివారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భూపాలపల్లి పట్టణంలోని ప్రధాన సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. తాగునీటి సమస్యను తీర్చామని చెప్పారు. మెడికల్ కళాశాల, సింగరేణి కార్మికులకు 1000 క్వార్టర్స్, రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలు, ప్రతి వార్డులో అంతర్గత రోడ్ల నిర్మాణాలు చేపట్టామని అన్నారు. భూపాలపల్లి పట్టణానికి నాలుగు దిక్కులుగా ఉన్న శివారుల్లో శ్మశాన వాటికల ఏర్పాటు, సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఈ ఎన్నికల్లో మరోసారి బీఆర్ఎస్ పార్టీకి అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు వెంకటరాణిసిద్దు, బుర్ర రమేష్, హరిబాబు, మేకల సంపత్‌యాదవ్, రాజబాబు, జనార్దన్, మల్లేష్ పాల్గొన్నారు.

కాళరాత్రి అలంకరణలో అమ్మవారు



కాళేశ్వరం: కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయ అనుబంధ దేవాలయాల్లో శ్రీదేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీశుభానంద దేవి, శ్రీమహా సరస్వతీ అమ్మవార్లు ఏడవ రోజు కాళరాత్రి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శనివారం ఆలయ అర్చకులు అమ్మవార్లను రంగురంగుల గాజులతో మాలలు వేసి అలంకరించి విశేష పూజలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు.





ప్రజాస్వామ్యంలో
బానిసలు ఉండరు..
యజమానులూ ఉండరు.
- అబ్రహంలింకన్

ఈ ముచ్చటెరికేనా?

శబ్దం పెరిగితే కేసులే..!



బయ్యారం: ఎన్నికలు వచ్చాయంటే చాలు బరిలో నిలిచిన అభ్యర్థుల ప్రచారంతో మైకులు హోరెత్తుతుంటాయి. అభ్యర్థులు తమకే ఓటు వేయాలని పల్లెల నుంచి పట్టణాల వరకు మైకులతో ప్రచారం కొనసాగిస్తుంటారు. అయితే విపరీతమైన శబ్దాలతో ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి ఉండటంతో ఎన్నికల సంఘం నిబంధనలను విధించింది. నిబంధనలకు విరుద్ధంగా అధిక శబ్దాలను పెట్టినట్లయితే సంబంధిత అభ్యర్థిపై కేసులు నమోదు చేయటంతోపాటు జరిమానా విధిస్తారు. నివాసప్రాంతాల్లో 45-55 డెసిబుల్స్, వైద్యశాలలు, విద్యాలయాలు, న్యాయస్థానాల ప్రాంతాల్లో 40-50 డెసిబుల్స్, వ్యాపార ప్రాంతాల్లో 55-65 డెసిబుల్స్, పారిశ్రామిక ప్రాంతాల్లో 70-75 డెసిబుల్స్ శబ్దాన్ని మాత్రమే వినియోగించాలి. ఇందుకు విరుద్ధంగా వినియోగిస్తే కేసులు నమోదు చేస్తారు.

నగదు విడుదల


కరీమాబాద్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వరంగల్ జిల్లాలోని తూర్పు, వర్ధన్నపేట, నర్సంపేట నియోజకవర్గాల పరిధిలో పోలీసు, ఫ్లయింగ్‌స్క్వాడ్ తనిఖీలు నిర్వహించి సీజ్ చేసిన రూ.30,53,250 నగదును విడుదల చేసినట్లు కలెక్టర్ ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈక్రమంలోనే నగదు, మద్యం ఇతర వస్తువులకు తగిన ఆధారాలు చూపించిన 20 కేసుల్లో 18 కేసులకు సంబంధించి జిల్లా గ్రీవెన్స్ రిడ్రెసల్ కమిటీ ద్వారా విడుదల చేయగా మిగతా 2 కేసులకు సంబంధించి తగిన ధ్రువీకరణ పత్రాలు చూపించిన వెంటనే విడుదల చేస్తామని పేర్కొన్నారు. జిల్లా సహకార అధికారి, జెడ్పీ సీఈఓ, జిల్లా ట్రెజరీ అధికారులతో కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతీ రోజు కలెక్టరేట్‌లో సాయంత్రం 5 గంటలకు కమిటీ సమావేశం ఉంటుందని తెలిపారు. సీజ్ చేసిన నగదు విషయమై అప్పీలు, ఆధారాలు పొంది దరఖాస్తు చేసుకోవడానికి ఈ కమిటీ ఏర్పాటు చేశామని తెలిపారు. సమస్యలుంటే జిల్లా నోడల్ అధికారి సంజీవరెడ్డిని ఫోన్ నంబర్ 91001 15737 ద్వారా సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.



పట్టణమే.. పశ్చిమం

పూర్తిగా నగరంలోనే వరంగల్ పశ్చిమ నియోజకవర్గం

- విద్యావేత్తలు అధికంగా ఉన్న ప్రాంతం
- ఇక్కడి నుంచి గెలిచిన నలుగురికి కేబినెట్‌లో స్థానం




టి.హయగ్రీవాచారి

హన్మకొండ: ఉమ్మడి వరంగల్ జిల్లాకు కేంద్రంగా ఉన్న ఈ నియోజకవర్గం ప్రస్తుతం హనుమకొండ జిల్లా కేంద్రంగా ఉంది. రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత రెండో పెద్ద మహానగరాల్లో ఒక్కటైన వరంగల్‌లో రెండు నియోజక వర్గాలుండగా ఇందులో పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గం ఒకటి. ఇది పూర్తిగా నగర ప్రాంతానికి పరిమితమైంది. హనుమకొండ, కాజీపేట ప్రాంతంతో వరంగల్ పశ్చిమ నియోజకవర్గం విస్తరించి ఉంటుంది. ఈ నియోజకవర్గంలో కార్మికులు, కూలీలు, ఆటో డ్రైవర్లతోపాటు అధికంగా విద్యావేత్తలైన ప్రొఫెసర్లు, డాక్టర్లు, ఇంజనీర్లు, వ్యాపారవేత్తలు, అత్యున్నత స్థాయి అధికారులు ఉంటారు. కాకతీయుల రాజధాని కేంద్రంగా పేరుగాంచిన చరిత్ర ఈ నియోజకవర్గానిది. ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమానికి ఊపిరిలూదిన ఈ నియోజకవర్గం మలి దశ తెలంగాణ పోరు నుంచి బీఆర్‌ఎస్‌కే అవకాశం ఇస్తూ వస్తుంది.


పునర్విభజనతో వరంగల్ పశ్చిమగా..


2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో హనుమకొండ నియోజకవర్గం రద్దయి వరంగల్ పశ్చిమ ఆవిర్భవించింది. వరంగల్ పశ్చిమ ఏర్పాటు నుంచి వరుసగా బీఆర్‌ఎస్ అభ్యర్థి దాస్యం వినయ్ భాస్కర్ విజయం సాధించారు. హనుమకొండ నియోజకవర్గంలో 1952 నుంచి 2004 వరకు పదిమార్లు ఎన్నికలు జరిగాయి. 1952లో పీడీఎఫ్ అభ్యర్థిగా ఇక్కడ గెలిచిన పెండ్యాల రాఘవరావు వర్ధన్నపేట అసెంబ్లీ నియోజకవర్గంతోపాటు.. వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి కూడా పోటీ చేసి.. మూడు చోట్ల విజయం సాధించి.. అరుదైన ఘనత సొంతం చేసుకున్నారు. తర్వాత రెండు అసెంబ్లీ స్థానాలకు రాజీనామా చేసి పార్లమెంట్ సభ్యుడిగా కొనసాగారు. 1978లో హనుమకొండ నుంచి టి.హయగ్రీవాచారి విజయం సాధించారు. హనుమకొండ నియోజకవర్గం నుంచి గెలుపొందిన వారిలో టి.హయగ్రీవాచారి, పి.వి.రంగారావు, సంగం రెడ్డి సత్యనారాయణ, దాస్యం ప్రణయ్ భాస్కర్ మంత్రులుగా పనిచేశారు. 2004లో ఇక్కడి నుంచి బీ(టీ)ఆర్‌ఎస్ అభ్యర్థిగా విజయం సాధించిన మందాడి సత్యనారాయణ రెడ్డి అసమ్మతి నేతగా ఉంటూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతు ఇచ్చి అనర్హత వేటుకు గురయ్యారు. అనంతరం హైకోర్టు స్టేతో నెల రోజులపాటు పదవిలో కొనసాగినా.. అనంతరం హైకోర్టు ఆయనకు వ్యతిరేకంగా తీర్పు ఇవ్వడంతో పదవిని కోల్పోయారు.

నాలుగుసార్లు వినయ్ భాస్కర్ విజయం

2014లో జరిగిన ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి దాస్యం వినయ్ భాస్కర్ ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి ఎర్రబెల్లి స్వర్ణపై 56,374 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. 2009 సాధారణ, 2010 ఉప ఎన్నికల్లో దాస్యం వినయ్ భాస్కర్ కాంగ్రెస్ అభ్యర్థి కె.దయాసాగర్ రావుపై 67,524 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. 2018 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి రేవూరి ప్రకాశ్ రెడ్డిపై బీఆర్‌ఎస్ అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్ 36,451 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. 2004లో జరిగిన ఎన్నికల్లో టీ(బీ)ఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన మందాడి సత్యనారాయణ రెడ్డి స్వతంత్ర అభ్యర్థి దాస్యం వినయ్ భాస్కర్‌పై 3,148 ఓట్ల స్వల్ప మెజారిటీతో గెలిచారు. 2009లో హనుమకొండ నియోజకవర్గాన్ని రద్దు చేసి వరంగల్ పశ్చిమగా చేశారు.


దాస్యం ప్రణయ్ భాస్కర్



మందాడి సత్యనారాయణ రెడ్డి


పెండ్యాల రాఘవరావు


పి.వి.రంగారావు


సంగంరెడ్డి సత్యనారాయణ

సంవత్సరం	గెలిచిన అభ్యర్థి	వచ్చినఓట్లు	ఓడిన అభ్యర్థి	ఓట్లు
వరంగల్ పశ్చిమ నియోజకవర్గం				
2009	దాస్యం వినయ్‌భాస్కర్	45,807	కె.దయాసాగర్‌రావు	39,123
2010	దాస్యం వినయ్‌భాస్కర్	88,435	కె.దయాసాగర్‌రావు	20,924
2014	దాస్యం వినయ్ భాస్కర్	83,492	ఎర్రబెల్లి స్వర్ణ	27,188
2018	దాస్యం వినయ్‌భాస్కర్	81,006	రేవూరి ప్రకాశ్ రెడ్డి	44,555
హనుమకొండ నియోజకవర్గం				
1952	పెండ్యాల రాఘవరావు	17,281	జీకే రెడ్డి	10,553
1952	ఎస్‌బీ రామనాథం	15,016	జేకే.రావు	10,221
1978	టి.హయగ్రీవాచారి	32,806	పి.ఉమారెడ్డి	19,786
1983	ఎస్.సత్యనారాయణ	39112	టి.హయగ్రీవాచారి	21,415
1985	వి.వెంకటేశ్వరావు	31,263	గండవరపు ప్రసాదరావు	23,404
1989	పి.వి రంగారావు	59,153	డి.ప్రణయ్‌భాస్కర్	35,810
1994	దాస్యం ప్రణయ్‌భాస్కర్	62,242	పి.వి రంగారావు	46,551
1998	పి.వి రంగారావు	46,060	మార్తినేని ధర్మారావు	43,100
1999	మార్తినేని ధర్మారావు	53,572	పి.వి రంగారావు	38,488
2004	ఎం.సత్యనారాయణ	60,730	డి.వినయ్‌భాస్కర్	57,582
హసన్‌పర్తి నియోజకవర్గం				
1952	మీర్జాబేగ్	13,386	వి.కె ధాగే	7,865
1962	సీహెచ్ వాసుదేవరెడ్డి	15,071	కె.రత్నమ్మ	9,442
1967	ఆర్.నరసింహరామయ్య	17,820	పి.కొర్నేలు	16,701
1972	ఆర్.నరసింహరామయ్య	24,526	పి.ఆనంద్	15,674
ధర్మసాగర్ నియోజకవర్గం				
1957	టి.హయగ్రీవాచారి	19,582	పివి రెడ్డి	12,222
1962	టి.హయగ్రీవాచారి	21,997	పివి రెడ్డి	19,337



అన్నల ఇలాఖాలో.. ఎన్నికల సందడి

- ఒకప్పుడు నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో ఎన్నికలంటే భయం
- నేడు అదే గ్రామాల్లో ఎన్నికల కోలాహలం
- ఏళ్ల తరబడిగా సాగిన మావోల కార్యకలాపాలు

కాజీపేట: ఎన్నికలు వచ్చాయంటే హనుమకొండ జిల్లాలోని అనేక గ్రామాల్లో గతంలో భయం భయంగా ఉండేది. ఒకవైపు ఎన్నికలను బహిష్కరించాలని మావోయిస్టు నక్సలైట్ల పిలుపు. ఎన్నికల్లో పాల్గొనాలని పోలీసుల కవాతుల మధ్య పల్లె జనాల వెన్నులో వణుకు పుట్టేది. ఎన్నికలు జరగనీయొద్దని నక్సల్స్.. ఎలాగైనా ఎన్నికలు జరిపించాలని పోలీసుల పట్టు మధ్య గ్రామస్తులు నలిగిపోయే వారు. ఎన్నికలు ముగిసి ప్రశాంతత ఏర్పడే వరకు బిక్కు బిక్కుమంటూ కాలంగడిపే పరిస్థితులు ఉండేవి.

తుపాకుల నీడన ఎన్నికలు..

నగరానికి కూతవేటు దూరంలోనే ఉన్న అనేక గ్రామాలు నక్సల్స్ ప్రభావితంగా ఉండేవి. కాజీపేట పట్టణానికి చెందిన క్రాంతిరణదేవ్ అలియాస్ బక్కన్న, మాచర్ల ఏసోబు, కదారి రాములు తదితరుల నేతృత్వంలో శివారు గ్రామాలన్నీ ఎన్నికలకు దూరంగానే ఉండేవి. కాజీపేటకు చుట్టూ పది కిలోమీటర్ల దూరంలోనే ఉన్న పల్లెల్లో ఎన్నికల బహిష్కరణకు పిలుపునిచ్చి విజయవంతం చేయాలని అన్నలు ప్రయత్నించేవారు. భట్టుపల్లి, తరాలపల్లి, రాంపేట, అయోధ్యపురం, టేకులగూడెం, దర్గా కాజీపేట, కొండపర్తి తదితర గ్రామాల్లో చిన్న, పెద్ద తారతమ్యం లేకుండా నక్సల్స్‌కు అండగా నిలిచేవారు. ప్రస్తుతం మావోయిస్టు పార్టీలో రాష్ట్ర కమిటీలో కీలకంగా వ్యవహరిస్తున్న మాచర్ల ఏసోబు అలియాస్ కై లాసం స్వగ్రామం టేకులగూడంలో పరిస్థితులు భయానకంగా ఉండేవి. నక్సల్స్‌కు షెల్టర్ జోన్లుగా పిలిచే ఈ గ్రామాల్లో ఎన్నికలు నిర్వహించడమంటే పోలీసులు, అధికారులకు సాహసమనే చెప్పాలి. పోలింగ్ బూతుల వద్ద గ్రామ పరిసరాల్లో భారీగా పోలీసులను మోహరింపజేసి ఎన్నికలను నిర్వహించిన సందర్భాలు అనేకం. కొన్ని సమయాల్లో సాయుధ పోలీసులు ఇంటింటికి తిరుగుతూ ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తరలించేవారంటే పరిస్థితి ఏవిధంగా ఉండేదో.. అర్థం చేసుకోవచ్చు. ఎన్నికల సమయంలో ఏ ఒక్క రాజకీయ నాయకుడు గ్రామాల్లో ప్రచారం చేసిన దాఖలాలు కనిపించేవి కావు. పోలీసులు ఎన్నికలకు నెలరోజుల ముందుగా నక్సల్స్ ప్రభావిత గ్రామాల్లో భారీగా కూంబింగ్ నిర్వహించి ఒకే.. అన్న తర్వాతే ఎన్నికల నిర్వాహణకు గ్రీన్ సిగ్నల్ పడేది. నక్సల్స్ ప్రభావిత గ్రామాల్లోని కొన్ని పోలింగ్ బూతుల్లో ఎన్నికల ఏజెంట్‌గా ఉండేందుకు పలాన పార్టీకి ఓటు వేయాలని ఓటర్లకు చెప్పేందుకు ఇంటింటికీ తిరిగి ఓట్లు అడిగేందుకు సాహసించేవారు కాదంటే అతిశయోక్తి కాదు.



మారిన రాజకీయ పరిస్థితులు..

ప్రస్తుతం సీన్ మారిపోయింది. అన్ని గ్రామాల మాదిరి నక్సల్స్ ప్రభావిత గ్రామాల్లో సైతం రాజకీయ వేడి పెరిగింది. 2009 తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన నిర్ణయాలతో నక్సల్స్‌ను అణచివేయడం కూడా ఒక కారణంగా చెప్పొచ్చు. తెలంగాణ మలి విడత ఉద్యమంలో ఆయా గ్రామాలు ప్రభావితమయ్యాయి. నాడు ఎన్నికలంటే భయపడే జనం .. నేడు క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. మారిన రాజకీయ పరిస్థితుల కారణంగా అన్ని గ్రామాల్లోనూ అభ్యర్థులు, కార్యకర్తలు ప్రచారాన్ని చేసుకోగల్గుతున్నారు. నచ్చిన వ్యక్తికి ఓటేసి గెలిపించుకుంటున్నారు. అప్పుడప్పుడు చౌరస్తాలు, హోటళ్లలో నలుగురు కలిసినప్పుడు ఆనాటి పరిస్థితులను మననం చేసుకుంటుండడం విశేషం.

ఓరుగల్లుకు చేరిన పారామిలటరీ బలగాలు

కాజీపేట రూరల్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని పలుచోట్ల విధులు నిర్వర్తించేందుకు శనివారం అస్సాం రాష్ట్రం నుంచి 900 మంది పారా మిలటరీ పోలీస్‌లు కాజీపేట జంక్షన్‌కు చేరుకున్నారు. అస్సాం రాష్ట్రంలోని 12 కంపెనీల నుంచి బీఎస్‌ఎఫ్, సీఆర్‌పీఎఫ్ పోలీసు బలగాలు కాజీపేట జంక్షన్‌కు చేరుకున్నాయని రైల్వే పోలీస్ అధికారులు తెలిపారు. స్పెషల్ ట్రైన్‌లో కాజీపేట జంక్షన్‌కు చేరుకున్న పారామిలటరీ బలగాలను వాహనాల్లో జిల్లా పోలీస్ అధికారులు ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు పంపించినట్లు రైల్వే పోలీస్ అధికారులు తెలిపారు. వందల సంఖ్యలో బలగాలు ఒక్కసారిగా కాజీపేటకు చేరుకోవడంతో ప్రయాణికులు ఒకింత ఆందోళనకు గురయ్యారు.


వాహనాల్లో వివిధ ప్రాంతాలకు వెళ్తున్న పారామిలటరీ బలగాలు

బీజేపీ అభ్యర్థుల బయోడేటా..

ఉమ్మడి జిల్లాలో ఏడుగురు బీజేపీ అభ్యర్థుల జాబితాకు సంబంధించి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, నాయకులు జవదేకర్, సునీల్ బన్సల్‌లతో కూడిన కమిటీ శనివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు అభ్యర్థులకు ఫోన్ చేసి వారి పేర్లను ఖరారు చేసినట్లు సమాచారం ఇచ్చారు. వరంగల్ తూర్పు అభ్యర్థిగా ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, వరంగల్ పశ్చిమ అభ్యర్థిగా రావు పద్మ, భూపాలపల్లి అభ్యర్థిగా చందుపట్ల కీర్తిరెడ్డి, జనగామకు దశమంత రెడ్డి, స్టేషన్ ఘన్‌పూర్‌కు మాజీ మంత్రి జి.విజయ రామారావు, వర్ధన్నపేట (ఎస్సీ)కి మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, మహబూబాబాద్ అసెంబ్లీ స్థానానికి జాటోతు హుస్సేన్ నాయక్‌లను అభ్యర్థులుగా ఎంపిక చేసినట్లు త్రిసభ్య కమిటీ సమాచారం ఇచ్చింది.

భూపాలపల్లి నియోజకవర్గం

అభ్యర్థి పేరు : చందుపట్ల కీర్తిరెడ్డి
భర్త పేరు : చందుపట్ల సత్యపాల్‌రెడ్డి
సంతానం : శ్రీవైష్ణవి, శ్రీవైభవి
ఇంటి నంబర్ : 6-2-290
గ్రామం, మండలం:హనుమకొండ

రాజకీయ ప్రవేశం :

- 2009 సంవత్సరంలో బీజేపీలో చేరిక
- 2013లో ఉమ్మడి వరంగల్ జిల్లా కోశాధికారి
- 2018 భూపాలపల్లి నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా పోటీ.. ఓటమి

జనగామ

పేరు : ఆరుట్ల దశమంతరెడ్డి
పుట్టిన తేదీ :16-06-1961
పట్టణం : జనగామ అర్బన్
తల్లిదండ్రులు : లక్ష్మి, వెంకటనర్సింహారెడ్డి
చదువు : ఎంఏ, బీఎల్, పీహెచ్‌డీ
భార్య : అనిత
వివాహం : 15-08-1990
సంతానం : శంతన్ కుమార్‌రెడ్డి
వృత్తి : హైకోర్టు న్యాయవాది
ప్రవృత్తి : సమాజసేవ, రాజకీయం
అభిమాన నాయకుడు: నరేంద్రమోదీ
జీవిత లక్ష్యం : జనగామ అభివృద్ధి

రాజకీయం :

ఉస్మానియా యూనివర్సిటీలో ఏబీవీపీ ప్రతినిధిగా సేవలు. ప్రస్తుతం పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్

పేరు : గుండె విజయరామారావు
తండ్రి : రాంచంద్రయ్య
పుట్టిన తేదీ : 02.06.1954
కులం : ఎస్సీ మాల (మిత్తి అయ్యంగార్)
భార్య : రామానుజమ్మ
సంతానం : సురేఖ, శ్వేత, రాహుల్
విద్యార్హతలు : ఎంబీబీఎస్, ఎండీ.(పీఏటీహెచ్), డీఎంసీహెచ్, ఎంఏ, పొలిటికల్
చిరునామా : ఇ.నెం.1-45, కమ్మరిపేట, వరంగల్ జిల్లా
ప్రస్తుత చిరునామా: 288, బాలమ్‌రాయ్ కో ఆపరేటివ్ సొసైటీ, మహేంద్ర హిల్స్, మారేడుపల్లి, సికింద్రాబాద్

చేపట్టిన పదవులు:

1984-89 సిద్దిపేట ఎంపీ, 1994-99గజ్వేల్ ఎమ్మెల్యే, 2004-2008 స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే, వైఎస్‌ఆర్ మంత్రి వర్గంలో పౌరసరఫరాల శాఖ మంత్రి

వరంగల్ తూర్పు

పేరు : ఎర్రబెల్లి ప్రదీప్ కుమార్‌రావు
తల్లిదండ్రులు : ఆదిలక్ష్మి, జగన్నాథరావు
భార్య : ఎర్రబెల్లి రేణుక
కుమారులు : ఎర్రబెల్లి ప్రణీత్‌రావు, ఎర్రబెల్లి వినీత్‌రావు
పుట్టిన తేదీ : 26.01.1957
జన్మస్థలం : పర్వతగిరి, జిల్లా: వరంగల్
విద్యార్హతలు : ఇంటర్మీడియట్
వ్యాపారాలు : మేనేజింగ్ పార్టనర్ శ్రీసత్యనారాయణ స్వామి ఫామ్స్(పౌల్ట్రీ)- పంథిని మేనేజింగ్ పార్టనర్ శ్రీసత్యనారాయణ స్వామి హచెరిస్ (పౌల్ట్రీ)- రాయపర్తి

చేపట్టిన పదవులు:

- 1997 సం.లో వరంగల్ ఇంజనీరింగ్ షాప్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు
- 1998 నుంచి నేషనల్ ఎగ్ కో- ఆర్డినేషన్ కమిటీ(నెక్) జోనల్ చైర్మన్
- 2000, 2005, 2015లో వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ చైర్మన్
- 2022లో బీజేపీలో చేరిక, 2023లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియామకం
- 2009లో తూర్పు నియోజకవర్గం నుంచి ప్రజారాజ్యం పార్టీ అభ్యర్థిగా పోటీ

వరంగల్ పశ్చిమ

పేరు : రావు పద్మ
భర్త పేరు : రావు అమరేందర్ రెడ్డి
ప్రస్తుత పదవి : బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు
విద్యార్హతలు : హోం సైన్స్, డొమెస్టిక్ సైన్స్, టీచర్ ట్రేనింగ్ (ఒకేషనల్ ప్రభుత్వ కాలేజీ)
పుట్టిన తేదీ : 04-07-1968
వృత్తి : వ్యాపారం, వ్యవసాయం
చిరునామా : ఇంటి నంబర్:1-7-879, శాంతి హైట్స్, హంటర్ రోడ్డు, హనుమకొండ
సంతానం : ఇద్దరు కుమారులు, కుమార్తె

నిర్వహించిన పదవులు:

బీజేపీ రాష్ట్ర కార్యదర్శి (ఉమ్మడి రాష్ట్రంలో), రాష్ట్ర కార్యదర్శి (తెలంగాణ)

మహబూబాబాద్

పేరు : జాటోతు హుస్సేన్ నాయక్
పుట్టిన తేదీ : 06-03-1982
తల్లిదండ్రులు : లచ్చనాయక్-కంసి
చదువు : డిగ్రీ బీఏ
భార్య పేరు : జమున
కుమారులు : డార్విన్ నాయక్, పునీత్ నాయక్
స్వస్థలం : మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం మచ్చర్ల
గ్రామం : తార్య తండా

రాజకీయ నేపథ్యం :

ప్రస్తుతం బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. గత ఎన్నికల్లో మహబూబాబాద్ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా ఓటమి

వర్ధన్నపేట

పేరు : కొండేటి శ్రీధర్
తండ్రి పేరు : వెంకటయ్య
తల్లి పేరు : ఎల్లమ్మ
భార్య : ఎలీషా
కుమారులు : శ్రీకాంత్, విక్రాంత్, శిరిష
పుట్టిన తేదీ : 01-05-1973
కులం : మాదిగ
చదువు : ఇంటర్
ఫోన్ నం.: 98481 39999, 98489 47664
ఇంటి నం : 4-78, ఇందిరా కాలనీ వర్ధన్నపేట, జిల్లా వరంగల్, 506 313

రాజకీయం అనుభవం:

- 1991 నుంచి 1998 వరకు యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు
- 1995 నుంచి 2000 వరకు వర్ధన్నపేట వార్డు సభ్యుడు
- 2003 నుంచి 2004 వరకు జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి
- 2001 నుంచి 2006 వరకు వర్ధన్నపేట సర్పంచ్
- 2006 నుంచి 2009 వరకు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు
- 2009 నుంచి 2014 వరకు వర్ధన్నపేట ఎమ్మెల్యే
- 2010 నుంచి 2013 వరకు ఏపీఎల్ఏ ఎస్సీ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు
- 2014 సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఓటమి
- 2020 సంవత్సరంలో బీజేపీలో చేరిక జిల్లా అధ్యక్షుడిగా బాధ్యత

రూ.50 వేల వరకే అనుమతి

- ఫిర్యాదు చేసిన 100 నిమిషాల్లో చర్యలు: కలెక్టర్ సిక్తా పట్నాయక్

హన్మకొండ: ఎన్నికల కోడ్ ముగిసే వరకు ప్రజలు రూ.50 వేలకంటే ఎక్కువ నగదును వెంట తీసుకెళ్లొద్దని హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీ-విజిల్ యాప్‌నకు 44 ఫిర్యాదులు అందాయని, ఫిర్యాదులు యాప్‌లో అప్‌లోడ్ చేసిన 10 నిమిషాల్లోనే దర్యాప్తు ప్రారంభమవుతుందని, 100 నిమిషాల వ్యవధిలో చర్యలు తీసుకుని, ఫిర్యాదుదారుడికి సమాచారం అందించనున్నట్లు తెలిపారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కాల్ సెంటర్‌కు ఇప్పటి వరకు మూడు ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి, కోడ్ ఉల్లంఘనలపై ఇప్పటి వరకు 209 ఫిర్యాదులు వచ్చినట్లు పేర్కొన్నారు. ఎక్కువ మొత్తంలో నగదు దొరికితే సీజ్ చేసి, జిల్లా ట్రెజరీలో జమ చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు రూ.35,67,501 సీజ్ చేసినట్లు తెలిపారు. రూ.23,62,901 రిలీజ్ చేసినట్లు తెలిపారు. ఈకమిటీ ప్రతీ రోజు డీఆర్డీఏ కార్యాలయంలో సాయంత్రం ఐదు గంటలకు సమావేశమవుతుందన్నారు. సీజ్ అయిన నగదు విషయమై ఆధారాలతో జిల్లా గ్రీవెన్స్ కమిటీకి అప్పీలు చేసుకోవాలని సూచించారు. వివరాలకు నోడల్ అధికారి, జిల్లా సహకార అధికారి నాగేశ్వరావును 99514 50116 నంబర్‌లో సంప్రదించాలని ఆమె కోరారు.


కలెక్టర్ సిక్తా పట్నాయక్

క్లుప్తంగా...

డబుల్ బెడ్రూం ఇవ్వని ఎమ్మెల్యే అవసరమా?

- కాంగ్రెస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నాయిని



రాయన్నపేట: 'నియోజకవర్గంలో ఒక్క డబుల్ బెడ్ రూమ్ కూడా కేటాయించని ఎమ్మెల్యే మనకు అవసరమా'? అని కాంగ్రెస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. శనివారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 29వ డివిజన్ రామన్నపేటలో ఎన్నికల ప్రచారాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఇంటింటికీ తిరుగుతూ ఓట్లను అభ్యర్థించారు. ఈసందర్భంగా రామన్నపేట గాంధీ బొమ్మ దగ్గర నుంచి గంగపుత్ర సంఘం, ఎస్సీ కాలనీ, కుంటి భద్రయ్య దేవస్థానం వెనుకాల నుంచి పాపయ్యపేట చమన్ ఓఎస్ నగర్ వరకు ప్రజాదీవెన యాత్ర కొనసాగించారు. ఈసందర్భంగా నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం ప్రతీ కార్యకర్త నడుం బిగించి ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బుద్ధ జగన్, డివిజన్ అధ్యక్షులు ఓరుగంటి పూర్ణ, ఎఐసీసీ ఎస్సీ డిపార్టుమెంట్ కో–ఆర్డినేటర్ డాక్టర్ పులి అనిల్‌కుమార్, బంక సరళ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సాఫ్ట్ బాల్ చాంపియన్‌గా 'హన్మకొండ'

- ముగిసిన సాఫ్ట్‌బాల్ పోటీలు

తూప్రాన్: పట్టణ సమీపంలోని రాష్ట్ర గురుకుల పాఠశాల క్రీడా మైదానంలో మూడు రోజులుగా జరుగుతున్న 10వ రాష్ట్ర స్థాయి సీనియర్ పురుషుల సాఫ్ట్ బాల్ చాంపియన్ షిప్ పోటీలు శనివారం ముగిశాయి. మూడవ రోజు క్వార్టర్ ఫైనల్‌లో మెదక్, సిద్దిపేట, హైదరాబాద్, రంగారెడ్డి, హనుమకొండ, నల్లగొండ, మహబూబ్‌నగర్, భూపాలపల్లి జట్లు హోరా హోరీగా తలపడ్డాయి. సెమీఫైనల్‌లో ఆతిథ్య మెదక్ జట్టు హైదరాబాద్‌పై 7–2 తో గెలుపొంది ఫైనల్‌కి చేరుకున్నాయి. హన్మకొండ జట్టు మహబూబ్‌నగర్‌పై గెలిచి ఫైనల్‌కు చేరుకున్నాయి. ఫైనల్‌లో మెదక్– హన్మకొండ జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. చివరి వరకు ఉత్కంఠ భరితంగా సాగిన మ్యాచ్‌లో హన్మకొండ జట్టు మెదక్ జట్టుపై 6–5 తేడాతో విజయం సాధించి బంగారు పతకం కైవసం చేసుకుంది. అసోసియేషన్ అధ్యక్షుడు కోడిప్యాక నారాయణగుప్త అధ్యక్షతన జరిగిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి తూప్రాన్ సీఐ శ్రీధర్ ముఖ్య అతిథిగా విచ్చేసి బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కాసాల నవీన్‌కుమార్, రాష్ట్ర సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శోభన్ బాబు, కోశాధికారి రేణుక, జాయింట్ సెక్రటరీ రాజేందర్, నాగిరెడ్డి, జిల్లా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అజయ్ కుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శి శ్యామ్ సుందర్ శర్మ, కోశాధికారి గోవర్ధన్‌గౌడ్ , వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన కోచ్, మేనేజర్‌లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పాస్టర్ మృతి

- మరో ఇద్దరికి గాయాలు

వెంకటాపురం(ఎం): ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని లింగాపూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో పాస్టర్ మోతె (రాజు) చార్లెస్ (55) మృతిచెందగా అతని మనుమరాలు ప్రవళిక(7)తోపాటు మరో బాలుడు జైపాల్ (8)కు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై చల్ల రాజు తెలిపిన వివరాల ప్రకారం.. జంగాలపల్లికి చెందిన మోతె చార్లెస్ బైక్‌పై ప్రవళిక, జైపాల్‌ను తీసుకొని జంగాలపల్లి నుంచి మచ్చాపూర్ వెళ్తున్నాడు.. అదేసమయంలో హైదారాబాద్‌కు చెందిన మోరె హరికృష్ణ కుటుంబంతో మేడారం వెళ్లి తిరిగి వరంగల్ వైపు వస్తున్న క్రమంలో లింగాపూర్ రహదారిపై బైక్, కారు ఎదురెదురుగా ఢీకొనడంతో బైక్‌పై ఉన్న చార్లెస్‌తోపాటు ప్రవళిక, జైపాల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చార్లెస్‌కు ములుగు జిల్లా ఆస్పత్రిలో చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో మృతిచెందాడు. ప్రవళిక, జైపాల్ ములుగు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

సాధారణ ఎన్నికల్లో 'స్థానిక' నినాదం

ఆరని 'మంగపేట'మంటలు

- స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే వరకు ఎలాంటి ఎన్నికల్లో పాల్గొనబోమని గిరిజనుల అల్టిమేటం
- అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరిస్తూ పలు గ్రామాల్లో ఆదివాసీ సంఘాల తీర్మానాలు
- మంగపేట మండలంలోని 23 రెవెన్యూ గ్రామాలు 5వ షెడ్యూల్ పరిధిలోకి వస్తాయని హైకోర్టు తీర్పు
- తీర్పును సవాల్‌చేస్తూ సుప్రీం తలుపుతట్టిన గిరిజనేతరులు
- హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీం.. అయినా ఎన్నికలు నిర్వహించడం లేదని గిరిజనుల ఆగ్రహం



మంగపేట గ్రామం

వరంగల్ డెస్క్:

ములుగు జిల్లా మంగపేట మండలంలో విచిత్ర పరిస్థితి. గిరిజన, గిరిజనేతరుల పంచాయితీతో 2005 నుంచి నేటి వరకు స్థానిక ప్రజా ప్రతినిధుల పాలన లేదు. ఇప్పటికీ ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గిరిజనులు గళం విప్పుతున్నారు. 12 ఏళ్లుగా ఎన్నికలు జరగకపోవడంతో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, స్థానిక ఆదివాసీలు విద్యా, ఉద్యోగం, ఉపాధి రంగాల్లో తీవ్రంగా నష్టపోయినట్లు చెబుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, అప్పటివరకు ఎలాంటి ఎన్నికలు నిర్వహించినా ఆదివాసీ గిరిజనులు ఓట్లు వేసేది లేదని ఆదివాసీ సంఘాల ఐక్యవేదిక నాయకులు అంటున్నారు. ఈ మేరకు పలు గ్రామాల్లో తీర్మానాలు చేస్తున్నారు. అసలు ఈ గిరిజన, గిరిజనేతల పంచాయితీ ఏమిటీ.. హైకోర్టు తీర్పు.. స్థానికుల డిమాండ్ మళ్లీ తెరపైకి వచ్చింది.

అసలు పంచాయితీ ఇదీ..

ములుగు జిల్లా మంగపేట మండలంలోని 18 గ్రామ పంచాయతీల సర్పంచ్ ఎన్నికలు 2005 వరకు జనరల్ రొటేషన్ (జనాభా)దామాషా పద్ధతిన జరిగాయి. 2006లో మండలంలోని 18 గ్రామ పంచాయతీల సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం ఎస్టీలకు 100 శాతం రిజర్వేషన్ ప్రకటిస్తూ ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసింది. ఎస్టీలకు 100 రిజర్వేషన్ కల్పించడాన్ని వ్యతిరేకిస్తూ ఎనిమిది మంది గిరిజనేతరులు హైకోర్టును ఆశ్రయించారు. అప్పటికే ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. దీంతో 2006లో 18 గ్రామ పంచాయతీల ఎన్నికలు ఎస్టీ రిజర్వేషన్ పద్ధతిన జరిగాయి. 2011లో గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించే సమయంలో రెండోసారి మంగపేట మండలం షెడ్యూల్డ్ ఏరియా కాదని, ఎస్టీలకు కల్పించి రిజర్వేషన్ చెల్లదని 1973, 74లో అప్పటి హైకోర్టు గిరిజనేతరులకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని, పలు అంశాలతో కూడిన నివేదికతో హైకోర్టును ఆశ్రయించారు. గిరిజనేతరుల ఫిర్యాదు స్వీకరించిన హైకోర్టు ఎన్నికలను నిలుపుదల చేస్తూ స్టే ఇచ్చింది. అప్పటి నుంచి మంగపేట మండలం షెడ్యూల్డ్ ఏరియా అని గిరిజనులు, కాదని గిరిజనేతరుల హైకోర్టును ఆశ్రయిస్తూ వస్తున్నారు. దీంతో 2013లో జరగాల్సిన పంచాయతీ ఎన్నికలు సైతం నిలిచి పోయాయి. ఈ క్రమంలో 2014 ఏప్రిల్‌లో మండలంలోని 23 రెవెన్యూ గ్రామాలు షెడ్యూల్డ్ ప్రాంత పరిధిలోకి వస్తాయని హైకోర్టు తీర్పునిచ్చింది. అయితే ఈ తీర్పును సవాల్ చేస్తూ గిరిజనేతరులు డివిజన్ బెంచ్‌లో రిట్ పిటిషన్ వేశారు. అప్పటి నుంచి ఇంటీరియమ్ డైరెక్షన్ డివిజన్ బెంచ్ పిటిషన్‌పై గిరిజనులు, సంఘాలు సవాల్ చేస్తూ పిటిషన్ వేయగా కేసు పూర్వపరాలను పూర్తిస్థాయిలో పరిశీలించిన తెలంగాణ హైకోర్టు మంగపేట మండలంలోని 23 రెవెన్యూ గ్రామాలు షెడ్యూల్డు ఏరియా పరిధిలోకి వస్తాయని జూలై 5వ తేదీన తుది తీర్పునిచ్చింది. ఆయా గ్రామాల్లోని గిరిజనులకు భారత రాజ్యాంగంలో పొందపరిచిన, 1/70, 1959 ఎల్టీఆర్(భూ బదలాయింపు), అటవీహక్కుల చట్టం, కోఆపరేటివ్ సహకార సంఘం ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్వహక్కులు గిరిజనులకు వర్తిస్తాయని తీర్పులో పేర్కొంది. ఆ తరువాత గిరిజనేతరులు సుప్రీం తలుపు తట్టారు. స్టే ఇవ్వాలని కోరారు. దీనిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు స్టే ఇవ్వడానిని నిరాకరిస్తూ కేవలం నోటీసులు జారీ చేసింది. ఈ పంచాయితీ ఇలానే ఉంది.

మండలంలోని 23 రెవెన్యూ గ్రామాలు

01) మంగపేట(పొదుమూరు), 2) తొండ్యాల లక్ష్మీపురం, 3) బోరునర్సాపురం, 04) కోమటిపల్లి, 05, చెరుపల్లి, 06) తిమ్మంపేట, 07) మల్లూరు, 08) చుంచుపల్లి, 09) రమణక్కపేట, 10) వాడగూడెం, 11) నర్సింహాసాగర్, 12) రాజుపేట, 13) కత్తిగూడెం,14) 15) బ్రాహ్మణపల్లి, 16) రామచంద్రునిపేట, 17) పూరేడుపల్లి,18) దోమెడ,19) బండారుగూడెం, 20) అకినేపల్లిమల్లారం,21) కమలాపురం, 22) గొళ్ళగూడెం, 23) బర్లగూడెం, 24) లొడుగుగూడెం,

ఊపందుకున్న ఎన్నికల బహిష్కరణ నినాదం

మంగపేట మండలాన్ని నాన్ ఏజెన్సీ ప్రాంతమని కొందరు గిరిజనేతరులు హైకోర్టును ఆశ్రయించి 2011 నుంచి స్థానిక ఎన్నికలు జరగకుండా అడ్డుకుని ప్రజలను ఇబ్బందులకు గురి చేశారని, స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే వరకు ఎలాంటి ఎన్నికలు నిర్వహించినా.. ఆదివాసీ గిరిజనులు ఓట్లు వేసేది లేదని ఆదివాసీ సంఘాల ఐక్యవేదిక ఏజెన్సీల్లో సమావేశాలు నిర్వహిస్తూ.. ఎన్నికల బహిష్కరణకు పిలుపునిస్తున్నారు. ఇప్పటికే ఈ నెల 13న చుంచుపల్లిలో ఆదివాసీ గిరిజన సంఘాలు, పలు రాజకీయ పార్టీల నాయకులు (ఐక్యవేదిక) సమావేశమై తీర్మానం కూడా చేశారు. అదేవిధంగా ఈ నెల 15న కొత్తూరు మొట్లగూడెం పంచాయతీ పరిధి తొండ్యాలలక్ష్మీపురం గ్రామానికి చెందిన ఆదివాసీ గిరిజనులు తీర్మానించారు. ఐక్యవేదిక తీసుకున్న నిర్ణయాన్ని స్థానిక తహసీల్దార్, ఎంపీడీఓ, ఆర్డీఓ, కలెక్టర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ప్రధాన ఎన్నికల అధికారికి వినతిపత్రం ద్వారా తెలియజేయనున్నట్లు వారు చెబుతున్నారు.


ఎన్నికల బహిష్కరణకు ఆమోదం తెలుపుతున్న గిరిజనులు

'స్థానిక'ఎన్నికలతోనే సమస్యల పరిష్కారం



స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణతోనే మంగపేట మండలంలో సమస్యలు పరిష్కారమవుతాయి. హైకోర్టు తీర్పు వచ్చిన వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ జిల్లా కలెక్టర్, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కమీషనర్, రాష్ట్ర ఎన్నికల అధికారికి వినతిపత్రాలు సమర్పించాం. అయినా నిర్వహించ లేదు. ప్రజాప్రతినిధులు లేకపోవడంతో గ్రామాల్లో సమస్యలు పరిష్కారం కావడం లేదు. అధికారులు స్పందించడం లేదు. ఆదివాసీ గిరిజన ప్రజలు తీసుకున్న అసెంబ్లీ ఎన్నికల బహిష్కరణ నిర్ణయానికి మా సంఘం పూర్తి మద్దతు తెలుపుతుంది.

– కబ్బాక శ్రావణ్‌కుమార్, తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

కోర్టు తీర్పు అమలు పర్చాలి



జూలైలో హైకోర్టు డివిజన్ ఫుల్ బెంచ్ ఇచ్చిన తీర్పును ప్రభుత్వం వెంటనే అమలు చేయాలి. 23 రెవెన్యూ గ్రామాలు షెడ్యూల్డ్ ఏరియా పరిధిలోకి వస్తాయని, భారత రాజ్యాంగంలో పొందపరిచిన 1/70, 159 ఎల్టీఆర్(భూబదలాయింపు), అటవీ హక్కుల చట్టం, కోఆపరేటివ్ సహకార సంఘం ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్వహక్కులు గిరిజనులకు వర్తిస్తాయని కోర్టు తీర్పు ఇచ్చింది. హైకోర్టు తీర్పుపై ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ స్పందించి స్థానిక ఎన్నికలు నిర్వహించకుండా నిర్లక్ష్యం చేస్తోంది.

– గొప్ప వీరయ్య, మన్యసీమ పరిరక్షణ సమితి (డోలు దెబ్బ) రాష్ట్ర అధ్యక్షుడు

ఆదివాసీలకు తీరని అన్యాయం



ఏజెన్సీ ప్రాంతమైన మంగపేట మండలంలో 2011 నుంచి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించక పోవడం, ప్రజా ప్రతినిధులు లేక మండల అభివృద్ధి కుంటుపడింది. గ్రామపంచాయతీల అభివృద్ధికి కేటాయించిన నిధులు దుర్వినియోగమవుతున్నాయి. గ్రామపంచాయతీల పరిపాలనా అధికారులు పనులు చేయకుండానే చేసినట్లుగా రికార్డులు సృష్టించి కోట్లాది రూపాయలు దండుకున్న సంఘటనలు అనేకంగా వెలుగు చూశాయి. అయినా చర్యలు శూన్యం. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేంత వరకు మండలంలో ఎలాంటి ఎన్నికలు నిర్వహించినా ఓట్లు వేసేది లేదని గిరిజనులు తీసుకున్న నిర్ణయానికి మా సంఘం కట్టుబడి ఉంది.

– పోలెబోయిన ఆదినారాయణ, ఆదివాసీ సేన మండల అధ్యక్షుడు

సమస్యల పరిష్కారంలో తాత్సారం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని ఎన్‌జీఓ, క్లాస్ ఫోర్త్ ఎంప్లాయీస్ మళ్లీ ఆందోళనకు నిర్ణయించారు. తమ సమస్యల పరిష్కారంలో యూనివర్సిటీ అధికారులు తాత్సారం చేస్తున్నారని ఎంప్లాయిస్ మండి పడుతున్నారు. గత నెల 24న కేయూ రిజిస్ట్రార్ ఆచార్య శ్రీనివాస్‌రావు, ఎంప్లాయీస్ బాధ్యులతో చర్చలు జరిపిన సమయంలో డిమాండ్లతో కొన్నింటిని పరిష్కరించేందుకు హామీ ఇచ్చారు. దీంతో ఉద్యోగ సంఘాల బాధ్యులు ఆందోళనను తాత్కాలికంగా వాయిదా వేసుకున్నారు. అయితే వివిధ కారణాలు చూపుతూ యూనివర్సిటీ అధికారులు డిమాండ్లు నెరవేర్చలేదు. దీంతో ఈనెల 19న సాయంత్రం 4–30గంటలకు కేయూ ఎన్‌జీఓ, క్లాస్‌ఫోర్త్ ఎంప్లాయిస్ బాధ్యులు రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు చాంబర్‌కు వెళ్లి ఆయనతో వాగ్వాదానికి దిగినట్లు సమచారం. హామీ ఇచ్చిన ప్రకారం డిమాండ్లు నెరవేర్చాలని పట్టుబట్టారు. రాత్రి 8–30గంటల వరకు రిజిస్ట్రార్ చాంబర్‌లోనే బైటాయించారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ అశోక్‌బాబును పిలిపించి రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు ఉద్యోగుల సమస్యలపై మాట్లాడినట్లు తెలిసింది. చివరికి ఉద్యోగ సంఘాల నాయకులను ఈనెల20న మళ్లీ తనను కలవాలని రిజిస్ట్రార్ సూచించారు. ఆమేరకు ఈనెల 20న సాయంత్రం ఆయా సంఘాల బాధ్యులు రిజిస్ట్రార్ చాంబర్‌కు వెళ్లారు. రిజిస్ట్రార్ లేకపోవడంతో ఫోన్‌లో సంప్రదించగా.. స్పందనలేకపోవడంతో ఆయా సంఘాల బాధ్యులు క్యాంపస్‌లోని వీసీ లాడ్జ్ వద్ద రిజిస్ట్రార్ ఉన్నారని తెలుసుకొని అక్కడికి సాయంత్రం 6–30గంటలకు వెళ్లారు. ఆసమయంలో రిజిస్ట్రార్ అక్కడే ఉన్నప్పటికీ లేరని సిబ్బందితో చెప్పించారని సమాచారం. దీంతో రాత్రి 9–30గంటల వరకువేచి ఉన్నారు. కానీ రిజిస్ట్రార్ బయటకు రాలేదు. దీంతో ఈనెల 26నుంచి ఆందోళనకు నిర్ణయించినట్లు కేయూ ఎన్‌జీఓ అధ్యక్షుడు లకావత్ యాదగిరి, జనరల్ సెక్రటరీ వల్లాల తిరుపతి, క్లాస్‌ఫోర్త్ ఎంప్లాయీస్ అధ్యక్షుడు అబ్దుల్‌షుకూర్, జనరల్ సెక్రటరీ కోర్నెల్ శనివారం తెలిపారు.


ఆందోళనను వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

ప్రధాన డిమాండ్లు..

- కేయూలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పదోన్నతి
- సూపరింటెండెంట్‌లుగా పదోన్నతి కల్పించాలి.
- 12మందికి జూనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించాలి.
- 8మందికి కారుణ్య నియామకాలు చేపట్టాలి.
- పరిపాలనాభవనం, పరీక్షల విభాగంలో మూడేళ్లుగా అదనపు పనికి సంబంధించిన అదనపు వేతనాలు చెల్లించాలి.
- 2013లో నియామకం అయిన ఉద్యోగుల పీఆర్‌సీని చెల్లించేలా చర్యలు తీసుకోవాలి.

కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తలు..

- 12 మందిని నియమించిన అధిష్టానం

సాక్షిప్రతినిధి, వరంగల్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఉమ్మడి వరంగల్‌లోని 12 అసెంబ్లీ నియోజకవర్గాలకు సమన్వయకర్తలను నియమించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ శనివారం ప్రకటించారు. జనగామ నియోజకవర్గ సమన్వయకర్తగా వరలక్ష్మి, స్టేషన్ ఘన్‌పూర్‌కు పింగిళి వెంకటరెడ్డి, పాలకుర్తికి వి.శ్రీకాంత్‌రెడ్డి, డోర్నకల్‌కు సాంటిరెడ్డి రంజిత్ రెడ్డి, మహబూబాబాద్‌కు బండి శ్రీనివాస్‌లను నియమించారు. అదేవిధంగా నర్సంపేటకు డా.పులి అనిల్‌కుమార్, పరకాలకు బొమ్మనపెల్లి అశోక్‌రెడ్డి, వరంగల్ పశ్చిమకు గోపగాని సారయ్య గౌడ్, వరంగల్ తూర్పునకు అయూబ్ ఖాన్, వర్ధన్నపేటకు కుందూరు వెంకటరెడ్డి, భూపాలపల్లికి మార్కం విజయకుమార్‌లను సమన్వయకర్తలుగా నియమించిన టీపీసీసీ.. ములుగుకు గొల్లపల్లి రాజేందర్ గౌడ్, రవళిరెడ్డికి బాధ్యతలు అప్పగించింది.

పోలీస్ అమరుల సేవలు చిరస్మరణీయం

- సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం: పోలీస్ అమరవీరుల సేవలు చిరస్మరణీయమని, వారి ఆశయాలను కొనసాగించేందుకు అందరూ కృషి చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లోని అమరవీరుల స్తూపం వద్ద శనివారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని (ఫ్లాగ్ డే)ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ప్రజల సేవ కోసం తమ ప్రాణాలను అర్పించిన పోలీసులు మహానుభావులని పేర్కొన్నారు. వారు చూపిన మార్గాన్ని అనుసరిస్తూ ప్రజల శ్రేయస్సు కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. అమరవీరుల కుటుంబాలకు ఎలాంటి సమస్య ఉన్నా సహకారం అందిస్తానని సీపీ తెలిపారు. ఈసందర్భంగా గతేడాది నుంచి ఇప్పటి వరకు దేశంలో విధి నిర్వహణలో మరణించిన 189 మంది పోలీస్ అమరవీరుల పేర్లను క్రైమ్ డీసీపీ మురళీధర్ చదివి వినిపించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయమూర్తి రాధాదేవి, వరంగల్, హనుమకొండ కలెక్టర్లు ప్రావీణ్య, సిక్తాపట్నాయక్, బల్దియా కమిషనర్ రిజ్వాన్ బాషా, డీసీపీలు మురళీధర్, రవీందర్, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌ఐలు, పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అంతకుముందు వీరంతా అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులు అర్పించారు. ఆర్‌ఐ చంద్రశేఖర్ సారథ్యంలో సాయుధ పోలీసుల శోక్ శ్రస్త్ర చేసి మరణించిన పోలీసులకు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. అదేవిధంగా వరంగల్ పోలీస్ కమిషనర్ కార్యాలయం నుంచి మిషన్ ఆస్పత్రి వరకు ర్యాలీ నిర్వహించారు.


సెల్యూట్ చేస్తున్న సీపీ అంబర్ కిషోర్, కలెక్టర్లు ప్రావీణ్య, సిక్తా పట్నాయక్, పోలీస్ అధికారులు


నివాళులు అర్పిస్తున్న అధికారులు


రక్తదాతలకు ప్రశంసపత్రాలు అందిస్తున్న సీపీ

రక్తదానం

కాజీపేట: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కాజీపేటలోని తారా గార్డెన్‌లో శనివారం ఏసీపీ డేవిడ్ రాజ్ ఆధ్వర్యంలో సబ్ డివిజన్ పోలీసులు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. సీపీ అంబర్ కిశోర్ ఝా శిబిరాన్ని ప్రారంభించారు. రెడ్‌క్రాస్ సిబ్బంది 78 యూనిట్ల రక్తం సేకరించారు. దాతలకు సీపీ ప్రశంసపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీసీపీ మురళీధర్, సీఐలు సార్ల రాజు, శ్రీధర్‌రావు, ఐవి శ్రీనివాస్‌రావు, పెద్ది వెంకటనారయణ, పి.శ్రీనివాస్‌రావు, విజయ చందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి కల్పనకు ఉద్యమిద్దాం

- ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వలీ ఉల్లాఖాద్రీ

నెహ్రూసెంటర్: దేశంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు ఉద్యమించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలీఉల్లాఖాద్రీ అన్నారు. సంఘం జిల్లా రెండవ మహాసభ జిల్లా కేంద్రంలోని వీరభవన్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జెండాను ఆవిష్కరించిన అనంతరం డాక్టర్ సయ్యద్ వలీఉల్లాఖాద్రీ మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగం పెరుగుతున్నా.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగాలు భర్తీ చేయకుండా కాలయాపన చేస్తున్నాయని విమర్శించారు. దేశంలో అధిక శాతం యువత నిరుద్యోగంతో పోరాడుతున్నారన్నారు. తెలంగాణలో పదేళ్ల కాలంలో ప్రభుత్వం భర్తీ చేసిన ఉద్యోగ లెక్కలను చెప్పాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగాల ఖాళీలను భర్తీ చేసేందుకు జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసి ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 29, 30 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారధి మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి, బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏమయ్యాయని ప్రశ్నించారు. ఈ మహాసభలో సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారధిరెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు వీరవెల్లి రవి, సీపీఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెలుగు శ్రావణ్, మాగం లోకేష్, సీపీఐ మండల కార్యదర్శి తండ సందీప్, జలగం ప్రవీణ్, అశోక్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అమరుల త్యాగాలు స్మరించుకోవాలి

- పోలీసు అమరుల త్యాగాలు చిరస్మరణీయం
- టీఎస్ఎస్పీ, పీటీసీలో సంస్మరణ దినోత్సవం
- నివాళులర్పించిన కమాండెంట్ శివప్రసాద్‌రెడ్డి, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రమేష్


పీటీసీలో నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ రమేష్

మామునూరు: శాంతి భద్రతల పరిరక్షణకు అహర్నిశలూ కృషి చేసి అమరులైన పోలీసుల త్యాగాలు చిరస్మరణీయమని టీఎస్ఎస్పీ నాలుగు, ఐదు బెటాలియన్ల కమాండెంట్ శివప్రసాద్‌రెడ్డి, పోలీసు శిక్షణ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కె.రమేష్ పేర్కొన్నారు. మామునూరులోని టీఎస్ఎస్పీ నాలుగు, ఐదు బెటాలియన్స్, పోలీసు శిక్షణ కళాశాలలో పరిపాలన విభాగం అధికారుల ఆధ్వర్యంలో శనివారం వేర్వేరుగా అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ పోలీసులు గౌరవ వందనాన్ని సమర్పించారు. అనంతరం అధికారులు మాట్లాడారు. దేశ రక్షణలో అసువులు బాసిన పోలీసుల సేవలు మరవలేనివని అన్నారు. విధినిర్వహణలో ప్రజలను రక్షించేందుకు తమ ప్రాణాలను పణంగా పెట్టిన పోలీసుల త్యాగాలు నేటి పోలీసులు స్ఫూర్తిగా తీసుకోవాలని తెలిపారు. ప్రజల ప్రాణ, మాన రక్షణతోపాటు శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల ప్రాత విశేషమైనదని కొనియాడారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు జయరాం, రాంబాబు, సోమని, శ్రీనివాస్, పీటీసీ డీఎస్పీలు శ్రీనివాస్, భిక్షపతి, ఏఓ కల్పన రెడ్డి, ఆర్ఐ చంద్రశేఖర్, కార్తీక్, నవీన్, కాశీరామ్, మహేష్, ఎల్ఐ కిరణ్‌కుమార్, అశోక్, ఆర్ఎస్సైలు దశరథం, రాజేష్, సుధాకర్, ఏఎల్ఐలు సత్యానారాయణ, దేవేందర్‌రెడ్డి, సుధాకర్, గోవర్ధన్, డాక్టర్ విజయ్‌కుమార్, ఫార్మసిస్ట్ వెంకటేశ్వర్లు, పీఆర్ఓ రామాచారి పాల్గొన్నారు.

సేంద్రియ సాగుతో మేలు

కరీమాబాద్: ప్రస్తుత పరిస్థితుల్లో రైతులకు సేంద్రియ వ్యవసాయం ద్వారా మేలు కలుగుతుందని మామునూరు కేవీకే సేద్య విభాగం శాస్త్రవేత్త డాక్టర్ సౌమ్య అన్నారు. గ్రామీణ ప్రాంత యువకులకు సేంద్రియ వ్యవసాయంపై నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం శనివారం ముగియడంతో వారికి సర్టిఫికెట్లు అందజేశారు. శాస్త్రవేత్తలు అరుణజ్యోతి, రాజు, శశాంక్, సాయికిరణ్, గణేశ్ పాల్గొన్నారు.


యువకులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న శాస్త్రవేత్తలు

కార్మికుల కష్టాలు చూసి చలించిపోయా..

- చీఫ్ విప్ వినయ్ భాస్కర్
- ఎఐఆర్‌పీడబ్ల్యూఎఫ్ బ్రాంచ్ ప్రారంభం

కాజీపేట రూరల్: కరోనా సమయంలో అసంఘటిత, సంఘటిత, రైల్వే రిటైర్డ్‌మెంట్ కార్మికుల కష్టాలు, బాధల్ని దగ్గర్నుంచి చూసి చలించిపోయానని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. కాజీపేట జంక్షన్‌లో శనివారం కాజీపేట ఆల్ ఇండియా రైల్వే పెన్షనర్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ (ఎఐఆర్‌పీడబ్ల్యూఎఫ్) కాజీపేట బ్రాంచ్ ప్రారంభోత్సవం జరిగింది. వినయ్‌భాస్కర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. రైల్వే రిటైర్డ్‌మెంట్ కార్మికులకు ఎలాంటి సమస్య వచ్చినా.. అండగా ఉంటానని, ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని ఆయన వేడుకున్నారు. రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ జోన్ అధ్యక్ష కార్యదర్శులు కె.శ్రీనివాస్, సీహెచ్.శంకర్‌రావు మాట్లాడుతూ.. రైల్వే పెన్షనర్స్ సమస్యల పరిష్కారానికి కాజీపేటలో ఫెడరేషన్ బ్రాంచ్‌ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాజీపేట రైల్వే డివిజన్ కేంద్రమైతే ఈ ప్రాంత సమస్యలు, కార్మికుల సమస్యలు తీరి అన్ని విధాలా ఈప్రాంత అభివృద్ధి జరుగుతుందన్నారు. ఏఐఆర్ పీడబ్ల్యూఎఫ్ కాజీపేట బ్రాంచ్ ప్రెసిడెంట్‌గా ఎస్.ఆర్.వి.రావును నియమించి సన్మానించారు. రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ డివిజన్ సెక్రటరి పి.రవీందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డివిజన్ మాజీ ప్రెసిడెంట్ వెంకటయ్య, సుధాకర్‌శాస్త్రీ, సత్యనారాయణ, ప్రేమ్‌కుమార్, వెంకట్‌మల్లు, రమణ, దేవులపల్లి రాఘవేందర్, కోంద్ర నర్సింగరావు, పి.సమ్మయ్య, జానీ, భిక్షపతి, రవి, రైల్వే పెన్షనర్స్ నాయకులు పాల్గొన్నారు.

ఫాతిమా చర్చిలో ప్రార్థనలు

కాజీపేట ఫాతిమానగర్ కెథిడ్రల్ చర్చిలో శనివారం దాస్యం వినయ్‌భాస్కర్.. ఓరుగల్లు పీఠాధిపతి బిషప్ ఉడుముల బాలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఫాదర్లు మర్రెడ్డి, జోసెఫ్, బ్రదర్ ఆంటోని, అనుకిరణ్, పి.సురేశ్‌బాబు, సిస్టర్లు పాల్గొన్నారు.

అభ్యర్థులెవరైనా గెలిచేది నేనే

కాజీపేట: 'రానున్న ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎవరైనా ప్రజల ఆశీర్వాదంతో మరోమారు గెలిచేది నేనే' అని చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. కాజీపేట భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవాలయంలో ప్రతిష్ఠించిన దుర్గామాతను శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పండితుల ఆశీస్సులతో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచార రథాలను ప్రారంభించారు. పట్టణంలోని ప్రధాన రహదారులపై ఉన్న దుకాణాలకు వెళ్లి కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరుతూ.. నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పథకాల కరపత్రాల్ని విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా ఆర్టీఏ కమిటీ సభ్యుడు కాటపురం రాజు, జిల్లా రైతు సమన్వయ కమిటీ సభ్యుడు సుంచు కృష్ణ, మిట్టపల్లి రవీందర్, బి.రంజిత్‌కుమార్, నాగవెల్లి శ్రీధర్, అయినవోలు ప్రవీణ్‌కుమార్ శర్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్ విప్ వినయ్‌భాస్కర్